క్లుప్తంగా

అచ్చంపేట సీఐగా శ్రీనివాసరావు



అచ్చంపేట: అచ్చంపేట సీఐగా పోలూరి శ్రీనివాసరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సత్తెనపల్లి రూరల్ సీఐగా పని చేస్తూ బదిలీపై అచ్చంపేటకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వెంకటప్రసాద్ వీఆర్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు, లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు రావచ్చన్నారు. ఆశ్చర్యకరంగా మండలంలో ప్రధాన శాఖలైన పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ అధికారులైన ఎంపీడీవో, తహసీల్దారు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసరావు పేరుగల వారే కావడం గమనార్హం.

అనుమతి లేకుండా వెంచర్లు వేసిన వారికి నోటీసులు

క్రోసూరు: క్రోసూరులో అనుమతి లేకుండా వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధం చేసిన నలుగురికి తహసీల్దార్ వీవీ నాగరాజు నోటీసులు ఇచ్చినట్లు గురువారం తెలిపారు. వివరాలు తెలియచేస్తూ షేక్ హబీబుల్లా 0.90 సెంట్లు, రొంపిచర్ల రమేష్ 1 ఎకరం 20 సెంట్లు, రొంపిచర్ల వాసుదేవమూర్తి 0.30 సెంట్లు, రొంపిచర్ల సీతారామచార్యులు 0.30 సెంట్ల భూమిలో అనుమతి లేకుండా వెంచర్లు వేసినట్లు తహసీల్దార్ తెలియజేశారు. దీనిపై నోటీసులందుకున్నవారు 15 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలోనే అనుమతులున్నా తమ దృష్టికి తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. మరి కొందరికి త్వరలో నోటీసులు అందజేయనున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో కందుల కొండారెడ్డి జ్ఞాపకార్థం రూ.10 లక్షల వ్యయంతో బాల వికాస సంస్థ సౌజన్యంతో నిర్మించిన సురక్షిత తాగునీటి వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. బాల వికాస సంస్థ మేనేజర్ మధుసూదనరెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామాలలో సురక్షిత తాగునీరు అందించాలనే ధ్యేయంతో బాలవికాస సంస్థ వాటర్ ప్లాంట్‌ల నిర్మాణాలకు తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. తాగునీటిని వృథా చేయరాదన్నారు. గ్రామస్తులకు ఇరవై లీటర్ల క్యాను రూ.5 చొప్పున అందించటం జరుగుతుందన్నారు. నిర్మాణానికి కందుల కృష్ణయ్య, బొక్కిసం వెంకటశివ, నాగమల్లేశ్వరరావు, కంది కోటిరెడ్డిలు సహాయం అందించారు. కార్యక్రమంలో భాగంగా బాలవికాస సంస్థ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. సంస్థ కో ఆర్డినేటర్ అబ్బులు, నిర్వాహకులు బొప్పూడి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిల్స్ పంపిణీ



బెల్లంకొండ: మండల కేంద్రంలోని భవిత సెంటర్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా గురువారం ట్రై సైకిల్స్ పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బి.రాజకుమారి తెలిపారు. కేంద్రానికి చెందిన ముగ్గురు దివ్యాంగులకు ఒక వీల్ చైర్, రెండు బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుందరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు జయ వీర వెంకటేష్, సీఆర్పీ నరసింహారావు పాల్గొన్నారు.

సత్తెనపల్లి టౌన్ సీఐగా నాగమల్లేశ్వరరావు



సత్తెనపల్లి: సత్తెనపల్లి టౌన్ సీఐగా ఎస్.నాగమల్లేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన బొప్పన బ్రహ్మయ్య గుంటూరు రేంజ్ వీఆర్‌కు వెళ్లారు. డీసీఆర్బీ గుంటూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న నాగమల్లేశ్వరరావు బదిలీపై సత్తెనపల్లి టౌన్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ నాగమల్లేశ్వరరావును పట్టణ పోలీసులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ నాగమల్లేశ్వరరావు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావును మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సీఐ అన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సర్వేపల్లికి ఘన నివాళి

పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థలో గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని నిర్వహించారు. డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు నరసింహారావు, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే పరిహారం

- కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యత, సేవల లోపాలపై ఫిర్యాదుకు అవకాశం
- అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట



బెల్లంకొండ: దైనందిన జీవితంలో ఎన్నో వస్తువులను కొనుగోలు చేస్తూ ఉంటాం.. ప్రతి రోజు ఏదో ఒక దుకాణంలో ఏదో ఒకటి కొంటూ ఉంటాం.. కొన్నిచోట్ల కొందరు దుకాణదారులు నాసిరకం వస్తువులను వినియోగదారులకు అంటగడుతుంటారు. కనీసం రసీదులు కూడా ఇవ్వకుండా మోసం చేస్తూ ఉంటారు. కాగా మనం కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినప్పటికీ.. ఏం చేయాలో తెలియక సతమతమవుతుంటాం. ఇలాంటి సమయంలోనే వినియోగదారుల కోసం 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం' అండగా నిలుస్తుంది. ఆయా వస్తువుల నాణ్యతలో తేడాలు వచ్చినప్పుడు రసీదు ఉంటే తగిన పరిహారం పొందే వీలు కలుగుతుంది.

సమస్య పరిష్కారం

మోసాలు, కొలతలు, ఇబ్బందులు, సేవలు ఇలా ఏ అంశంలోనైనా వినియోగదారునికి ఇబ్బంది కలిగితే వినియోగదారుల పరిరక్షణ చట్టం ద్వారా సమస్య పరిష్కారంతోపాటు పరిహారం కూడా పొందే వీలుంది. వినియోగదారుల సేవలకు ఆటంకం, నష్టం కలిగితే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై ఫిర్యాదు చేయవచ్చు.

- వినియోగదారు తూకాల్లో మోసపోయినా, వస్తువులో నాణ్యత లోపించినా, సేవలు సక్రమంగా అందకపోయినా ఫిర్యాదు చేయవచ్చు. ఉదాహరణకు చిన్న సూది దగ్గర నుంచి బ్యాంకింగ్, ఆసుపత్రి, రైల్వే, విమానయానం, విద్యుత్, కొరియర్ సర్వీస్, గ్యాస్, ఫుడ్ డెలివరీ ఇలా అన్ని రకాల సేవల విషయంలో ఇబ్బందులు ఏర్పడినప్పుడు ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చు. అంతే కాకుండా మార్కెట్లో కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత ప్రమాణాల్లో లోపాలు, తేడాలు, ఎంఆర్పీ కంటే ఎక్కువ వసూలు చేసినా, వస్తువుల్లో ముద్రించిన పరిమాణం కన్నా తక్కువగా ఉండి నష్టపోయినా ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు.

కావాల్సినవి ఇవి...

- వస్తువు కొనుగోలు చేసినప్పుడు కచ్చితమైన, సరైన రసీదు/బిల్లు తీసుకోవాలి.
- వినియోగదారుని పేరు, చిరునామా ఎవరిపై ఫిర్యాదు చేస్తున్నారో వారి పేర్లు రాయాలి.
- కొనుగోలు చేసిన వస్తు సేవల వివరాలు, బిల్లు నంబరు, నష్టం విలువ వివరంగా అంకెల్లో రాయాలి.
- కోరుకుంటున్న పరిహారం వివరాలను దరఖాస్తులో తప్పనిసరిగా పేర్కొనాలి.

బిల్లులు తీసుకోవడం తప్పనిసరి

నియోజవర్గంలోని పెదకూరపాడు, బెల్లంకొండ, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు మండలాల్లో వందల సంఖ్యలో పలు రకాల దుకాణాలు ఉన్నాయి. కాగా ఒక్క ఎల్రక్టానిక్స్, మొబైల్స్ దుకాణాలలో తప్ప మిగిలిన ఏ దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లులు ఇవ్వడం లేదు. వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత బిల్లు తీసుకోవాలన్న స్పృహ కూడా రోజురోజుకు జనంలో తగ్గిపోతుంది. ఇదే అంశం దుకాణదారులకు వరంగా మారుతుంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన లేకపోవడంతో చాలామంది కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు ఇవ్వమని అడగడం లేదు. ఒకవేళ కొందరు బిల్లులు అడిగినా వ్యాపారులు తెల్ల కాగితంపై రాసి ఇస్తున్నారే తప్ప సరైన రసీదు మాత్రం ఇవ్వడం లేదు. బిల్లులు తీసుకోవడం ద్వారా కొనుగోలు చేసిన వస్తువుల కారణంగా నష్టపోయినా, సదరు కంపెనీ, దుకాణదారులు మోసం చేసినా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నష్టపరిహారం పొందే వీలుంటుంది.

అవగాహన కరువు

వినియోగదారుల పరిరక్షణ చట్టం గురించి ప్రజలకు కనీస అవగాహన ఉండడం లేదు. సంబంధిత అధికారులు కూడా అవగాహన కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపణలు నెలకొన్నాయి. వినియోగదారుల పరిరక్షణ చట్టంపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి



మహిళలకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేసిన వ్యవసాయ సిబ్బంది



ర్యాలీలో రైతులు తదితరులు

పెదకూరపాడు : పెదకూరపాడు మండలం ఆర్ఎస్‌కేలో మండల స్థాయి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, సెర్ప్ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందితో మండల లెవల్ కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ ఎంఏవో శాంతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందు రైతులు పొలంలో పీఎండీఎస్ (నవధాన్య విత్తనాలు) చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడ పీడల్ని నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ వేయడం వలన నేల గుల్లబారుతుందన్నారు. నీటిని నిలువ చేసుకొనే శక్తి పెరిగి నీటి ఎద్దడిని తట్టుకోగలుగుతుందని చెప్పారు. ఏపీఎం సునీత మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. విషపూరితమైన రసాయనాలు వాడిన కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటివి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. మండల సమాఖ్య, గ్రామ సంఘం, ఎస్‌హెచ్‌జీలలో ప్రకృతి వ్యవసాయం అజెండాగా పెట్టాలని, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో సపోర్ట్ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో గత నాలుగు సంవత్సరాలు పైబడి నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన దర్శి శేషారావు, వెంకటేశ్వర్లు, శ్రీ రంగయ్యలను సన్మానించారు. వేసవికాలంలో విత్తనాలు మొలకెత్త డానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో డెమో ద్వారా వివరించారు. సమావేశంలో మండల సీసీలు శ్రీనివాసరావు, ప్రసాద్ మండల సమైక్య అధ్యక్షురాలు శివ రంజని, వీవోఏలు, వీపీఏలు, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, ఎన్ఎఫ్ఏ నందకుమార్, బి.అప్పలరాజు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధు బాబు, యూనిట్ ఇన్‌చార్జి అమూల్య, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

దొడ్లేరు(క్రోసూరు): ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర పంటలు వేయటం ద్వారా రైతన్నలకు ఆదాయంతో పాటు భూమిలో కావలసిన సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందని రైతు సేవా కేంద్రం యూనిట్ ఇన్‌చార్జి సావిత్రి అన్నారు. మండలంలోని దొడ్లేరు రైతు సేవా కేంద్రం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయ విభాగంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025-26 సంవత్సరంలో ప్రతి రైతు భూమి, విస్తీర్ణం, పంటలు, పాడి పశువులు వివరాలను సిబ్బందికి తెలియజేయాలని గ్రామస్తులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో, అనుబంధ శాఖలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారని, అదేవిధంగా ప్రతి రైతు వారి భూమిలో (పీఎండీఎస్) సాగు చేయాలన్నారు. మిరప, వరి, కంది, ప్రధాన పంటలకు ముందుగా ఒక ఎకరాకు 500 కేజీల ఘన జీవామృతం చల్లి ప్రధాన పంటతో పాటు పలు అంతర పంటలు వేయటం ద్వారా రైతుకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాస్టర్ ట్రైనర్ జయలక్ష్మి, పవన్, ఏఏవో కమల, దివ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహారావు, కృష్ణవేణి, షహనాజ్, అరుణ, ఉష రైతులు పాల్గొన్నారు.

అడిషనల్ క్వాంటం సాధకుడు సోమేశ్వరరావు



సత్తెనపల్లి: పెన్షనర్స్ ఎడిషనల్ క్వాంటం సాధించారంటే దానికి పెన్షనర్స్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కీర్తిశేషులు సోమేశ్వరరావు కారకుడని రిటైర్డ్ మండల విద్యా శాఖాధికారి గద్దె మురహరిరావు అన్నారు. పట్టణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోమేశ్వరరావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యుడు పెద్దింటి చంద్రయ్య మాట్లాడుతూ సోమేశ్వరరావు ఒక పనిని ప్రారంభించారంటే అది పూర్తి అయ్యే వరకు విశ్రమించరన్నారు. జగన్నాథ నాయుడు ఒక కవిత ద్వారా వారి గొప్పతనాన్ని తెలియజేశారు. ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్ తదితరులు సోమేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ పాఠశాలల మోజులో పడొద్దు



బెల్లంకొండ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన అందిస్తున్నామని పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శంకరరావు తెలిపారు. గురువారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, పాపాయపాలెం గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల మోజులో పడవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో, నాణ్యమైన విద్యా బోధనను అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన వివరాలు, సౌకర్యాలను వివరించే కరపత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సాంబయ్య, సుధాకర్, గౌస్, ప్రసాద్, బలరాం నాయక్, నాగలక్ష్మి, అల్లాబి, స్వాతి, ఫర్హానా పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీకి కృతజ్ఞతలు



జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్ర కేబినెట్ ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కూటమి ప్రభుత్వానికి గురువారం కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండారు నాగరాజు అధ్యక్షత వహించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బలిజేపల్లి సురేష్, అంకాళ ప్రభుదాసు, పల్లె మార్కు, జనసేన నియోజకవర్గ నాయకుడు చిలకా పూర్ణ మాట్లాడారు. మాదిగలకు టీడీపీ అండగా నిలుస్తుందని, అందుకే ఎస్సీ వర్గీకరణను సాధించుకోగలిగామన్నారు. దశాబ్దాల పోరాటంలో భాగంగా సుప్రీంకోర్టు మాదిగలకు రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ని జారీ చేసిందన్నారు. మాదిగ జాతి ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ సారథ్యంలో ఎన్నో పోరాటాలను చేసి ఈ వర్గీకరణ సాధించుకున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతో మాదిగలకు రిజర్వేషన్ కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సెనగపూల నరసింహారావు, బొజ్జ కాంతారావు, వర్ల శ్రీను, కోట జోసఫ్, గుర్రపాటి సునీల, చిలకా చంటి, కనుమూరి డానియెల్, వాసా వెంకటేశ్వర్లు, చిలకా శ్యామ్, ఎస్.జయరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మాదిగ నాయకులు ఉన్నారు.

బోరు బాగుపడింది..



చేతి పంపును బాగు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పెదకూరపాడు : ఈ నెల 16వ తేదీన సాక్షి పత్రికలో బాగు చేయండి సారు... అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. గత కొన్ని నెలల నుంచి ఎస్సీ కాలనీలోని క్రీస్తు లూథరన్ దేవాలయం వద్ద చేతిపంపు మరమ్మతులకు నోచుకోవటం లేదని సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన అధికారులు మరమ్మతులకు గురైన చేతి పంపును బాగు చేశారు. కాలనీ వాసులు, సంఘస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ అవార్డు అందుకున్న ఎంఈవోకు సన్మానం



ఎంఈవో ప్రసాదరావును సన్మానించిన ఎంపీపీ కోటయ్య తదితరులు

క్రోసూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాద్‌రావును ఎంపీపీ పి.కోటయ్య, ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల హానరబుల్ చైర్మన్ జి.దాసు, పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా దక్షిణ భారత ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా అవార్డును అందుకున్న ఎంఈవో ఏకుల ప్రసాదరావుకు గురువారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవోను ఎంపీపీ పి.కోటయ్య, ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి చైర్మన్ గార్లపాటి దాసు శాలువా, పూలమాలలతో సన్మానించినారు. ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ ప్రసాదరావు ఎంఈవోగా క్రోసూరు మండలంతో పాటు అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. గార్లపాటి దాసు మాట్లాడుతూ ప్రసాదరావు విద్యార్థులకు ఎంతగానో తోడ్పడతారని అన్నారు. మరెన్నో అవార్డులు అందుకోవాలని అన్నారు. ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రాధ రమణశ్రీ, ఏపీవో బుల్ల వెంకటేశ్వరరావు, మేదర రోశయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

పెదకూరపాడు : భారతీయ ప్రమాణికల ప్రకారం ఆరు సంవత్సరాల పాటు విధులు పూర్తిచేసిన సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీలను క్రమబద్ధీకరించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరణ చేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సీహెచ్‌వోల అధ్యక్షురాలు అనుపమ మాట్లాడుతూ పైన పేర్కొన్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలని, రాష్ట్ర సంఘం పిలుపుమేరకు దశలవారీగా నిరసనలు చేస్తున్నామని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌బాబు, సంఘ నాయకులు రాగిణి, ఖాశీదా, మేరీ, శివకుమారి, రజని, మల్లేశ్వరి, రమాదేవి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

ఎంపీపీ మేకల హనుమంతరావు



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు మండల పరిధిలోని గ్రామాలలో వేసవి కాలాన్ని పురస్కరించుకుని తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. గురువారం మండలం పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల పరిధి గ్రామాలలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో ఈ వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగు పరచటానికి పంచాయతీ సిబ్బందికి సరైన ఆదేశాలు ఇచ్చి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో బోరు పంపుల పనితీరుపైన పంచాయతీ కార్యదర్శి సమీక్షించి పనిచేయని బోర్ పంపుల మరమ్మతులను వెంటనే చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో మాధవి, మండల స్థాయి అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షిక వేడుకలు



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి



భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్న పోలీసులు

సత్తెనపల్లి: పట్టణ తాలూకా సెంటర్ సమీపంలోని సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి తొమ్మిదవ వార్షిక వేడుకలు సత్తెనపల్లి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన సత్తెనపల్లి రూరల్ పోలీసులు మాట్లాడుతూ వివిధ రకాల గొడవలు, తగాదాలు, వర్గ పోరు, ఇలా నిత్యం బాధితులతో పోలీస్ స్టేషన్ నిండిపోతుందన్నారు. వివిధ నేరారోపణలతో వచ్చేవారికి కొంతమేరకైనా ఆధ్యాత్మికత, సత్ప్రవర్తన కలుగుతాయని తమ వంతుగా స్టేషన్ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రతి రోజు స్వామి వారికి పూజలతో పాటు ప్రతి సంవత్సరం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యం



గ్యాస్ సిలిండర్ నుంచి వెలువడే మంటల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సత్తెనపల్లి: అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని భవిష్య స్కూల్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో భవిష్య పాఠశాల కరస్పాండెంట్ ఐ.శ్రీధర్, స్కూల్ సిబ్బంది, సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఆలా శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ సాగర్ బాబు, ఫైర్‌మాన్‌లు ఎం.మోహన్ బాబు, బి.నాగేశ్వరరావు, ఎస్‌కే బాబ్జి, సిబ్బంది ఉన్నారు.

మోడల్ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి



నకరికల్లు: ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లలో సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు సూచించారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను గురువారం ఆయన సందర్శించారు. పారిశుద్ధ్య పనులు తనిఖీ చేశారు. గ్రీన్ అంబాసిడర్‌లు, పంచాయతీ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కుంకలగుంట, గుండ్లపల్లి, నకరికల్లు గ్రామాలను మోడల్‌గా తీసుకొని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మోడల్‌గా ఎంపిక చేసిన పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. 10 వేల జనాభా పై బడిన పంచాయతీలను డీపీవో, 10 వేల లోపు జనాభా గల పంచాయతీలను డీఎల్‌పీవో ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తామని అన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేయాలని, తడి, పొడి చెత్తకు గల వ్యత్యాసాలను, వాటి నుంచి ఎరువు తయారు చేసే విధానాలను వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుంకర మత్తయ్య, సింగరాజు అంకారావు, గ్రామ కార్యదర్శి పరసాబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో, సత్తెనపల్లి

O.S. No. 01./2022

పిటిషన్

పలిసెటి సత్యనారాయణ ... వాది

v/s

పుల్లపంతుల సోమేశ్వరరావు & 2 others ... ప్రతివాదులు

To

ప్రతివాది నెం:1. పుల్లపంతుల సోమేశ్వరరావు తండ్రి రామకృష్ణ, వృత్తి ఉద్యోగి, ఇంటి నెం. 1-3-32, రైల్వే స్టేషన్ దగ్గర, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

ప్రతివాది నెం: 3. పుల్లపంతుల వెంకట రమణమూర్తి తండ్రి రామకృష్ణ, వృత్తి [illegible] షాప్ నెం. 1-6, డోర్ నెం. 5-72-37, [illegible], గుంటూరు సిటీ. ప్రస్తుత అడ్రస్: [illegible], సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

పై నెంబరు కేసులో శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తము ది.25-04-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10.30 గంటలకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క అక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీ పై ఏకపక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు వాయిదా తేదీ. 25-04-2025

పి.వి. నరసింహ శాస్త్రి

వాది తరుపు న్యాయవాది, సత్తెనపల్లి.

సెల్: 9030104944